# భారత్ఐర్లాండ్ తొలి టీ20కి వర్షం ముప్పు..



- **నేటి నుంచి భారత్, ఐర్లాండ్ మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్**
- **బెల్‌ఫాస్‌ట్‌లోని తొలి మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశం**
- **15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ అరంగేట్రంపై సర్వత్రా ఆసక్తి**
- **మ్యాచ్ పూర్తిగా రద్దయ్యే సూచనలు లేవంటున్న వాతావరణ శాఖ**

**ప్రజాస్వరం:**

భారత్, ఐర్లాండ్ జట్ల మధ్య రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్ నేటి నుంచి ప్రారంభం కానుంది. బెల్‌ఫాస్ట్ వేదికగా జరగనున్న ఈ తొలి పోరులో గెలిచి సిరీస్‌లో శుభారంభం చేయాలని టీమిండియా భావిస్తుండగా, సొంతగడ్డపై భారత్‌కు షాక్ ఇవ్వాలని ఐర్లాండ్ పట్టుదలగా ఉంది. అయితే, ఈ ఆసక్తికరమైన మ్యాచ్‌కు వరుణుడు అడ్డంకిగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. మరోవైపు 15 ఏళ్ల యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఈ మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ అరంగేట్రం చేస్తాడా? లేదా? అనే దానిపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

**వాతావరణం ఎలా ఉందంటే?**

స్థానిక వాతావరణ నివేదికల ప్రకారం బెల్‌ఫాస్‌ట్‌లో ఈరోజు మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఆకాశం మేఘావృతమై, తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉంది. మ్యాచ్ జరిగే సమయంలో వర్షం పడే సంభావ్యత 30 నుంచి 43 శాతం వరకు ఉండొచ్చని, ఉష్ణోగ్రతలు 22 నుంచి 23 డిగ్రీల సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశం ఉందని అంచనా. అయితే, భారీ వర్షం కురిసి మ్యాచ్ పూర్తిగా రద్దయ్యేంత ప్రభావం ఉండకపోవచ్చని తెలుస్తోంది. మధ్యమధ్యలో ఆటకు అంతరాయాలు కలిగినా, ఓవర్లను కుదించి అయినా మ్యాచ్ జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

**అందరి కళ్లూ సూర్యవంశీపైనే**

ఈ సిరీస్‌లో అందరి దృష్టి 15 ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీపైనే ఉంది. ఇటీవలి ఐపీఎల్ సీజన్‌లో తన నిర్భయమైన బ్యాటింగ్‌తో, అద్భుతమైన స్ట్రోక్‌ప్లేతో ప్రపంచ స్థాయి బౌలర్లను సైతం ఎదుర్కొని సంచలనం సృష్టించాడు. ఈ ప్రదర్శనతో ఏకంగా భారత జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఒకవేళ తొలి టీ20లో తుది జట్టులో అవకాశం లభిస్తే, భారత పురుషుల, మహిళల క్రికెట్ చరిత్రలోనే అంతర్జాతీయ అరంగేట్రం చేసిన అత్యంత పిన్న వయస్కుడైన ఆటగాడిగా వైభవ్ సరికొత్త చరిత్ర సృష్టిస్తాడు. బీహార్‌కు చెందిన ఈ యువ కెరటం అరంగేట్రం కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

**మ్యాచ్ వివరాలు**

భారత్, ఐర్లాండ్ మధ్య తొలి టీ20 బెల్‌ఫాస్‌ట్‌లోని సివిల్ సర్వీస్ క్రికెట్ క్లబ్ మైదానంలో జరగనుంది. భారత కాలమానం ప్రకారం సాయంత్రం 5:30 గంటలకు టాస్ వేయనుండగా, 6:00 గంటలకు మ్యాచ్ ప్రారంభమవుతుంది. ఈ మ్యాచ్‌ను సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. సోనీ లివ్ యాప్, వెబ్‌సైట్‌లో లైవ్ స్ట్రీమింగ్ అందుబాటులో ఉంటుంది. మొత్తం మీద మ్యాచ్‌కు వర్షం ముప్పు పొంచి ఉన్నప్పటికీ, భారత యువ సంచలనం చారిత్రాత్మక అరంగేట్రం కోసం ఎదురుచూస్తున్న అభిమానుల ఆశలపై వాతావరణం నీళ్లు చల్లకూడదని అందరూ కోరుకుంటున్నారు.

# ఇంగ్లండ్ టూర్ కు టీమిండియా ఎంపికపై రవిశాస్త్రి ఏమన్నాడంటే...!

- **ఇంగ్లండ్ పర్యటనకు యువత, అనుభవంతో కూడిన జట్టు**
- **టీ20 జట్టుకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్, తిలక్ వర్మ వైస్ కెప్టెన్**
- **కొత్త జట్టుపై మాజీ కోచ్ రవిశాస్త్రి, గవాస్కర్ ప్రశంసలు**
- **వన్డే జట్టులోకి విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, బుమ్రా పునరాగమనం**
- **అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ వంటి యువ ఆటగాళ్లపై ఆసక్తి**

**ప్రజాస్వరం:**

ఇంగ్లండ్‌తో జరగనున్న వైట్‌బాల్ సిరీస్ కోసం ప్రకటించిన భారత జట్టు యువత, అనుభవం కలబోతతో ఆదర్శవంతంగా ఉందని టీమిండియా మాజీ హెడ్ కోచ్ రవిశాస్త్రి విశ్వాసం వ్యక్తం చేశాడు. సవాలుతో కూడిన ఇంగ్లీష్ పరిస్థితుల్లో రాణించే సత్తా ఈ జట్టుకు ఉందని ధీమాగా చెప్పాడు. త్వరలో జరగనున్న ఈ పర్యటన నేపథ్యంలో, టీ20 జట్టుకు నాయకత్వం వహిస్తున్న శ్రేయస్ అయ్యర్‌పై శాస్త్రి ప్రశంసలు కురిపించాడు.

సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌తో మాట్లాడుతూ, "ఈ కొత్త భారత జట్టులో యువత, అనుభవం అద్భుతంగా మేళవించాయి. టీ20 క్రికెట్‌లో శ్రేయస్ అయ్యర్ బలమైన ఆటగాడు. అతనికి కెప్టెన్సీ ఇవ్వడం నాకు ఆనందంగా ఉంది. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, రవి బిష్ణోయ్, ప్రసిద్ధ్ కృష్ణ వంటి యువ ఆటగాళ్ల నుంచి అద్భుత ప్రదర్శనలు ఆశిస్తున్నాను" అని శాస్త్రి తెలిపాడు.

ఇక టీ20 జట్టుకు శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా, తిలక్ వర్మ వైస్‌కెప్టెన్‌గా వ్యవహరించనున్నారు. ఈ జట్టులో అభిషేక్ శర్మ, రవి బిష్ణోయ్, ప్రసిద్ధ్ కృష్ణ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, హర్షిత్ రాణా, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ వంటి వారికి చోటు దక్కింది. మరోవైపు, వన్డే జట్టులోకి సీనియర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, జస్‌ప్రీత్ బుమ్రా తిరిగి వచ్చారు. తొడ కండరాల గాయం నుంచి కోలుకున్న కోహ్లీ ఈ సిరీస్‌తో పునరాగమనం చేయనుండగా, బుమ్రా పేస్ విభాగానికి నాయకత్వం వహిస్తాడు.

ఈ జట్టు కూర్పుపై బ్యాటింగ్ దిగ్గజం సునీల్ గవాస్కర్ కూడా స్పందించాడు. "ఇంగ్లండ్ టూర్‌కు ఎంపికైన జట్టు ఆసక్తికరంగా ఉంది. ముఖ్యంగా అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ వంటి యువ ప్రతిభావంతులు ఎలాంటి బౌలింగ్‌నైనా ఎదుర్కొని మ్యాచ్‌ను మలుపు తిప్పగలరు. వారికి ఇది గొప్ప అవకాశం" అని అభిప్రాయపడ్డాడు.



# మొహర్రం సందర్భంగా షర్బత్ పంపిణీ...

**మెదక్ జూన్ 26 (ప్రజా స్వరం)**

మొహర్రం పర్వదినాన్ని పురస్కరించుకుని మెదక్ పట్టణంలో గంగా జమున తహజీబ్ సోషల్ సర్వీస్ వ్యవస్థాపకుడు వసీం ఆధ్వర్యంలో షర్బత్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, పట్టణ సీఐ మహేష్ పాల్గొని ప్రజలకు షర్బత్ పంపిణీ చేశారు. అనంతరం నిర్వాహకులను అభినందిస్తూ, మత సామరస్యాన్ని పెంపొందించే ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వజీద్, సాజిద్, అకిల్ తదితరులు పాల్గొన్నారు.



# కుల మతాలకు అతీతంగా జరుపుకునే పండుగ మొహరం

- **18 వ వార్డు మాజీ కౌన్సిలర్ భవాని రాఘవేందర్ గౌడ్..!**

**మేడ్చల్:**

మేడ్చల్ పట్టణంలో నిర్వహించిన ఫీర్ల పండుగ వేడుకలలో 18 వ వార్డు మాజీ కౌన్సిలర్ భవాని రాఘవేందర్ గౌడ్ కుటుంబ సమేతంగా పాల్గొని దట్టి సమర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హిందూ,ముస్లింలు అందరూ కలిసి మత సామరస్యంతో జరుపుకునే పండుగ మొహరం పండుగ అని పేర్కొన్నారు.ఎప్పుడూ అందరూ సోదర భావంతో కుల,మతాలకతీతంగా పండుగ జరుపుకోవాలని పిలుపునిచ్చారు. అందరూ కలిసి మెలిసి మొహరం పండుగ జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు.ఫీర్ల పండుగ సందర్భంగా ప్రజలందరూ ఎంతో భక్తి శ్రద్ధలతో మొహరం పండుగనీ జరుపుకుంటున్నారని వారందరికీ మొహరం పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం

**మెదక్ జూన్ 26 (ప్రజా స్వరం)**

మెదక్ పట్టణంలో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం శుక్రవారం రెండవ రోజు కొనసాగింది. ఈ కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు, కొత్త ఓటరు నమోదు కోసం ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను అధికారులు చేపడుతున్నారు. ఈ పంపిణీ ప్రక్రియ ప్రస్తుతం ఇంటింటికీ కొనసాగుతుందని తెలియజేస్తున్నాయి. ఈ నేపథ్యంలో, మెదక్ పట్టణంలోని 12వ వార్డులో జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని కౌన్సిలర్ అనీస్ ఫాతిమా, బిఆర్ఎస్ నాయకులు. ఇందాద్ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. వార్డు పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరుతున్నారు.




# ఫిఫా వరల్డ్ కప్‌లో ఆల్‌టైమ్ రికార్డ్

## టికెట్ల ధరలు ఆకాశాన్నంటినా.. పోటెత్తిన ఫుట్‌బాల్ ప్రేమికులు

- **ప్రేక్షకుల హాజరులో ఫిఫా ప్రపంచకప్ సరికొత్త రికార్డు**
- **56 మ్యాచ్‌లకే 36 లక్షల మందికి పైగా హాజరు**
- **1994లో అమెరికాలో నెలకొల్పిన రికార్డు బద్దలు**
- **అధిక టికెట్ ధరలు, వీసా సమస్యలు ఉన్నప్పటికీ పోటెత్తిన అభిమానులు**
- **99 శాతం ఆక్యుపెన్సీతో కిక్కిరిసిన స్టేడియాలు**

**ప్రజాస్వరం:**

సాకర్ క్రేజ్ ప్రపంచాన్ని ఊపేస్తోంది. టికెట్ల ధరలు సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరినా, వీసా నిబంధనలు ఇబ్బంది పెడుతున్నా అభిమానుల ఉత్సాహం మాత్రం తగ్గలేదు. అమెరికా, కెనడా, మెక్సికో దేశాల సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న 'ఫిఫా వరల్డ్ కప్ 2026' సరికొత్త చరిత్ర సృష్టించింది. ఫుట్‌బాల్ ప్రపంచకప్ చరిత్రలోనే అత్యధిక మంది ప్రేక్షకులు హాజరైన టోర్నీగా ఇది సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఈ క్రమంలోనే 32 ఏళ్ల క్రితం నాటి రికార్డు తుడిచిపెట్టుకుపోయింది.

న్యూజెర్సీలోని మెట్‌లైఫ్ స్టేడియంలో జూన్ 25న జర్మనీ, ఈక్వెడార్ దేశాల మధ్య జరిగిన గ్రూప్‌ఈ మ్యాచ్ సందర్భంగా ఈ మైలురాయి నమోదైనట్లు ఫిఫా అధికారికంగా ప్రకటించింది. ఈ టోర్నీలో ఇప్పటివరకు జరిగిన 56 మ్యాచ్‌లకు కలిపి మొత్తం ప్రేక్షకుల సంఖ్య 36,05,357కు చేరింది. దీంతో 1994లో అమెరికాలోనే జరిగిన వరల్డ్ కప్‌లో నమోదైన పాత రికార్డు (35,87,538 మంది) బద్దలైంది. అప్పట్లో టోర్నీ మొత్తం మీద కేవలం 52 మ్యాచ్‌లు మాత్రమే జరగగా, ఈసారి జట్ల సంఖ్య 48కి పెరగడంతో మ్యాచ్‌ల సంఖ్య కూడా 104కు చేరింది. ఇంకా సగం కంటే ఎక్కువ మ్యాచ్‌లు మిగిలి ఉండటంతో.. టోర్నీ ముగిసే సమయానికి ఈ సంఖ్య దాదాపు రెట్టింపు అయ్యే అవకాశం ఉందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు.

ప్రస్తుతం జరుగుతున్న మ్యాచ్‌లలో స్టేడియాలు సగటున 99 శాతానికి పైగా నిండిపోతుండటం విశేషం. జూన్ 16న జరిగిన నాలుగు గ్రూప్ మ్యాచ్‌లను ఏకంగా 2,81,000 మందికి పైగా వీక్షించి, ఒకే రోజు అత్యధిక మంది చూసిన మ్యాచ్‌లుగా సరికొత్త రికార్డు సృష్టించారు.



అయితే ఈ విజయాల వెనుక తీవ్రమైన విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఫిఫా అనుసరిస్తున్న డైనమిక్ ప్రైసింగ్ పాలసీ వల్ల టికెట్ల ధరలు వేల డాలర్లకు చేరుకున్నాయి. రీసేల్ మార్కెట్‌లో ఒక్కో టికెట్ ప్రారంభ ధర 800 డాలర్లు (దాదాపు రూ. 66,000) పలుకుతోంది. సాధారణ అభిమానుల కోసం కేటాయించిన 60 డాలర్ల టికెట్లు ఉన్నప్పటికీ.. హోటల్ చార్జీలు, ప్రయాణ ఖర్చులు భారంగా మారాయని ప్రేక్షకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్ దేశాల నుంచి వచ్చే అభిమానులకు అమెరికా వీసా నిబంధనలు పెద్ద అడ్డంకిగా మారాయి.

ఈ లోపాలు, ఆర్థిక పరమైన సవాళ్లు ఎలా ఉన్నప్పటికీ.. మైదానంలో ఆటగాళ్ల అత్యుత్తమ ప్రదర్శన, స్టేడియంలో లభిస్తున్న అద్భుతమైన వాతావరణం టోర్నీని విజయవంతం చేస్తున్నాయని ఫిఫా అధికారులు పేర్కొన్నారు. త్వరలోనే నాకౌట్ మ్యాచ్‌లు ప్రారంభం కానుండటంతో, రాబోయే రోజుల్లో స్టేడియాలు మరిన్ని రికార్డులకు వేదిక కావడం ఖాయంగా కనిపిస్తోంది.

